క్లుప్తంగా

రెవెన్యూ భూముల పరిశీలన



విస్సన్నపేట: మండలంలోని కొండపర్వలో, నరసాపురంలో రెవెన్యూ సంబంధ సమస్యలను తిరువూరు ఆర్డీవో మాదురి పరిశీలించారు. విస్సన్నపేట తహసీల్దారు కార్యాలయం, మండల పరిషత్‌ల వద్ద చలివేంద్రాలు ప్రారంభించారు. విస్సన్నపేట తహసీల్దారు కార్యాలయంలో సర్వేయర్లకు సమావేశం నిర్వహించి భూసర్వేలో తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు. తహసీల్దారు లక్ష్మీకల్యాణి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుజాత పాల్గొన్నారు.

ఎంప్లాయీస్ సంఘ్ పోరాటాలు స్ఫూర్తిదాయకం



గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపులో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. వర్క్‌షాప్ చీఫ్ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళల సమస్యలపై ఎంప్లాయీస్ సంఘ్ చేస్తున్న పోరాటాలు స్ఫూర్తిదాయకమన్నారు. సంఘ్ కార్యదర్శి గద్దా సురేష్ మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తామన్నారు. పలువురు మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో మహిళా సంక్షేమ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు లీలా శ్రీనివాస్, దూరదర్శన్ సప్తగిరి చానల్ వ్యాఖ్యాత చంద్రిక జమున, బ్రాంచి అధ్యక్షుడు శివనాగేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి డేవిడ్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

పీ-4 సర్వే పరిశీలన

ఇబ్రహీంపట్నం: మండలం పరిధి గ్రామాల్లో పీ–4 సర్వే ప్రతిష్టాత్మంగా నిర్వహించాలని తహసీల్దార్ వై.వెంటేశ్వర్లు, ఎంపీడీవో సునీత శర్మ తెలిపారు. గ్రామాల్లోని సచివాలయాల పరిధిలో జరుగుతున్న పీ–4 సర్వేను మంగళవారం వారు పరిశీలించారు. గ్రామాల్లో సిబ్బంది నిర్వహిస్తున్న సర్వే యాప్‌లో ఏమైనా ఇబ్బందులు తలెత్తుతున్నాయా, ప్రజల నుంచి సమాధానాలు రాబట్టే క్రమంలో వారి నుంచి ఎదురవుతున్న ప్రశ్నలపై ఆరా తీశారు. గృహోపకరణాలు, కరెంటు బిల్లు, బైకులు, కార్లు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగం కలిగి ఉన్నారా వంటి ప్రశ్నలతో ప్రజల్లో అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సర్వే విధానం బట్టి సామాన్యులకు ఒనగూరే ప్రయోజనం ఏమీ ఉండదని ప్రజలు చర్చించుకుంటున్నారు. అంతకు ముందు ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులకు సర్వేపై అవగాహన కల్పించారు.

నేడు చదువుకుంటేనే రేపు బాగు



నూజివీడు: పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని గొల్లపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు గౌతమ్, ఎస్‌కే నజ్మా పేర్కొన్నారు. గొల్లపల్లి హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు వైద్యులు మంగళవారం పరీక్ష ప్యాడ్, పెన్నులు, పెన్సిళ్లు, స్కేల్స్, ఎరేజర్, షార్పనర్లను అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న ఆశలను నిజం చేసేందుకు కష్టపడి చదువుకోవాలన్నారు. నేడు చదువుకుంటేనే రేపు బాగుంటుందన్నారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం పొట్లూరి రాధికారాణి, ఉపాధ్యాయ సిబ్బంది కలిసి వైద్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైద్యులు కౌశిక్, హెల్త్ సూపర్‌వైజర్ గూండ్రు శ్రీను, విద్యా కమిటీ చైర్మన్ బావిశెట్టి వీరయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర మాజీ మంత్రి పరామర్శ

ఆగిరిపల్లి: అన్నే నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావు మంగళారం పరామర్శించారు. మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అన్నే నాగేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న సాంబశివరావు ఆయన ఇంటి వద్ద కుమారుడు అన్నే రవిని పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రభుత్వానికి బుద్ధి చెబుదాం..

ఆగిరిపల్లి: యువత పోరుకు విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున తరలిరావాలని మండల వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెజవాడ రాంబాబు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బుధవారం వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆగిరిపల్లిలోని పొగడ చెట్ల మండపం వద్ద జెండా ఎగరవేస్తామని, అనంతరం మాజీ ఎమ్మెల్యే మేకావెంకట ప్రతాప్ అప్పారావు ఆధ్వర్యంలో ఏలూరులో నిర్వహించే యువత పోరు కార్యక్రమానికి భారీ ఎత్తున, యువత, విద్యార్థులు నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రభుత్వానికి బుద్ధి చెబుదామన్నారు.

మామిడి అనుబంధ పరిశ్రమలు కలే

- మైలవరం నియోజకవర్గంలో మామిడి అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు టీడీపీ హామీ
- 2014–19లో హామీ ఇచ్చిన అప్పటి మంత్రి
- మళ్లీ అధికారంలోకి వచ్చినా అమలుకు నోచుకోని వైనం
- హామీ కలగానే మిగిలిపోతోందంటున్న రైతులు



రెడ్డిగూడెంలో మామిడి మార్కెట్

మైలవరం: రెడ్డిగూడెంలో మామిడి అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని తెలుగుదేశం పార్టీ నాయకులు ఇచ్చిన హామీ కలగానే మిగిలిపోయింది. మైలవరం నియోజకవర్గం రెడ్డిగూడెం మండలంలో మామిడి అనుబంధ పరిశ్రమ ఏర్పాటు చేస్తామని నాడు అధికారంలో ఉన్న తెలుగుదేశంకు చెందిన మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మామిడి రైతులకు హామీ ఇచ్చారు. అయితే మాజీ మంత్రి ఇచ్చిన హామీ కలగానే మిగిలిపోయింది.

2014–19లో హామీ ఇచ్చిన అప్పటి టీడీపీ మంత్రి..

మైలవరం నియోజకవర్గం పరిధిలోను, నూజివీడు ప్రాంతంలో అత్యధికంగా మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. మామిడి సీజన్‌లో మైలవరం, రెడ్డిగూడెం, జి.కొండూరు మండలాల ప్రాంతాల్లో తాత్కాలికంగా పాకలు వేసి మామిడి విక్రయాలు నిర్వహిస్తూ ఉంటారు. 2014–19లో అప్పటి ఎమ్మెల్యే, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మైలవరం నియోజకవర్గంలో ఎక్కువగా మామిడి తోటలు విస్తరించి ఉన్నాయని, రైతులకు అందుబాటులో మామిడి అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేస్తే వారికి సౌలభ్యంగా ఉంటుందని, అందుకు తాను కృషి చేస్తానన్నారు. కానీ తాను అధికారంలోకి వచ్చినప్పటికీ మామిడి అనుబంధ పరిశ్రమలు ఏర్పాటుకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

నియోజకవర్గంలోనే అధికం..

మామిడి తోటలు డిసెంబర్ 23 నాటికి ఎన్టీఆర్ జిల్లాలో 53 వేల ఎకరాలు, మైలవరం నియోజకవర్గంలో 22 వేల ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. దీంతో మామిడి రైతులు తాము కష్టపడి పండించిన పంటకు సరైన ధర పలకడం లేదని, విజయవాడ మార్కెట్‌కు తీసుకువెళ్లాలంటే రవాణ ఖర్చులు పెరిగి భారంగా మారడంతో మిగిలిపోయిన మామిడిని రోడ్డు పక్కన పారబోసేవారు.

రైతులు చెప్పేది ఇదీ..

రెడ్డిగూడెంలో మామిడి అనుబంధ పరిశ్రమలైన మామిడి తాండ్ర, మామిడి జ్యూస్, మామిడికాయల పచ్చళ్ల తయారీ కేంద్రాలు ఏర్పాటు చేస్తే ఇటు మామిడి రైతులకు, గ్రామస్తులకు కూడా కొంతవరకు నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లభిస్తుందని రైతులు చెబుతున్నారు.

ప్రస్తుత ఎమ్మెల్యే మాటలు కూడా..

ప్రస్తుతం అధికార పార్టీ ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ కూడా తాను ఎమ్మెల్యేగా గెలిస్తే మైలవరం నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కానీ ఇచ్చిన హామీలు నీటి మూటలుగానే మిగిలిపోయాయి. ఇప్పటికైనా మామిడి అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసి మామిడి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

రైతులను ఆదుకోవాలి..



మైలవరం నియోజకవర్గంలో ఎక్కువగా మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. మామిడి పంట దిగుబడికి రైతులు ఎక్కువగా కృషి చేసే వారు. ప్రస్తుతం మామిడికి ఆశించినంతగా ధరలేకపోవడంతో రైతులు దిగాలుతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలో మామిడి అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసి ప్రభుత్వం ఆదుకోవడానికి చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

– జే.శ్రీనివాసరావు, బొర్రగూడెం

సామూహిక ఎలుకల నివారణపై అవగాహన



జీకొత్తూరులో అవగాహన కల్పిస్తున్న మాధవీలత, కెనడీ

ఇబ్రహీంపట్నం: ప్రస్తుతం రబీ వరి పంట దుబ్బులు చేసి పిలక వేసే దశలో ఉన్నందున ఎలుకల వల్ల కలిగే నష్టం అపారంగా ఉంటుందని ఇన్‌చార్జి ఎంఏవో ఆర్.వాసుదేవ్ తెలిపారు. మండలంలోని జూపూడి, కేతనకొండ గ్రామాల్లో ఎలుకల సామూహిక నివారణ చర్యల్లో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. ఎర తయారుచేయు విధానాన్ని వివరించారు. ఎకరాకు 200 గ్రాముల నూకలు, 4 గ్రాముల బ్రోమోడయోలిన్, 4 గ్రాముల శనగ పిండి మిశ్రమంతో తయారు చేసుకోవాలి. చేతులకు గ్లౌజ్ వేసుకుని కలిపిన మిశ్రమాన్ని పొట్లాలుగా కట్టాలి. ఎలుకల బొరియలను తొలిరోజు మట్టితో కప్పేయాలి. రెండోరోజు మట్టి తొలిగించిన బొరియలు గుర్తించి వాటిలో 10 గ్రాముల చొప్పున కట్టిన ఎర మిశ్రమ పొట్లాలు పెట్టాలి. ఎర మిశ్రమ పొట్లం పెట్టిన బొరియల్లోకి వెళ్లిన మూషికాలు వాటిని తిని మరణిస్తాయని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. మండలంలో తొలిరోజు 90 మందికి బ్రోమోడయోలిన్ మందు పంపిణీ చేశామన్నారు. ఏఏవో వెంకట్, గ్రామ వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

జి.కొండూరు: రబీ వరి సాగులో ఎలుకలను నిర్మూలించేందుకు బ్రోమోడయోలో మందును ఉచితంగా ఇస్తున్నట్లు ఏఓ రాంకుమార్ తెలిపారు. కుంటముక్కల గ్రామంలో సామూహిక ఎలుకల నిర్మూలనా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ వంగూరు కుమారికెనడీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రైతులందరూ ఈ మందును సామూహికంగా వినియోగించినప్పుడే ఎలుకలను సమర్థవతంగా నిర్మూలించడం సాధ్యమవుతుందని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మైలవరం: రైతులు తమ వ్యవసాయ భూముల్లో ఎలుకలు నిర్మూలనకు సామూహికంగా చర్యలు తీసుకోవాలని పీడీ, ఏపీఎమ్ఐపీ పీఎమ్ సుభాని తెలిపారు. మండలంలోని చంద్రాల గ్రామంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం రబీ–2025, పొలం పిలుస్తోంది కార్యక్రమం ఆర్‌ఎస్‌కేలో మంగళవారం నిర్విహించారు. ఎలుకలు వరి పంటతో పాటు మిగిలిన పంటలను అన్ని దశలలో నష్టపరుస్తాయని, దీని నివారణకు రైతులు సామూహికంగా చర్యలు తీసుకోవాలన్నారు. పీడీ మాట్లాడుతూ రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్ రాయితీపై కావలసినవారు రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. ఎలుకల నివారణకు విషపు ఎర తయారీ చూపించి మందు పంపిణీ చేశారు. బొరియలలో మందు పొట్లాలు పెట్టి చూపించారు. మామిడి పంటను పరిశీలించారు. మైలవరం ఏడీఏ ఎమ్.శ్రీనివాసరావు, ఏడీఏ (డీఆర్‌సీ) పి.మోనీషా, ఏఓ సంధ్యారాణి, మాజీ ఎంపీపీ జొన్నలగడ్డ గంగాధరరావు, ఏఈఓ ఎమ్.నాగరాజు నాయక్‌లు పాల్గొన్నారు.

జీకొత్తూరు(తిరువూరురూరల్): పంటలకు నష్టం కలిగించే ఎలుకల నిర్మూలనకు రైతులు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయశాఖ ఉప పసంచాలకులు మాధవీలత కోరారు. మండలంలోని జీకొత్తూరులో మంగళవారం సామూహిక ఎలుకల నిర్మూలనా కార్యక్రమం నిర్వహించారు. ఎర తయారు చేసి 10 గ్రాముల చొప్పున పొట్లాలు కట్టి ఎలుకల బొరియల్లో ఉంచితే అవి చనిపోతాయని తెలిపారు. తిరువూరు సహాయ వ్యవసాయ సంచాలకులు కెనడీ, వ్యవసాయాధికారి పద్మ తదితరులు పాల్గొన్నారు.

భవానీపురం(విజయవాడపశ్చిమ): వరి పంటలో ఎలుకల నివారణకు రైతులు సన్నద్ధం కావాలని ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయ అధికారిణి విజయకుమారి అన్నారు. మంగళవారం రాయనపాడు, గొల్లపూడి గ్రామ రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. నూరు శాతం రాయితీపై ఎలుకల నివారణ మందును రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. విజయవాడ ఏడీఏ బీ వెంకటేశ్వరరావు, విజయవాడ రూరల్ ఎంఏఓ బీ రఘునాథ్ బాబు మాట్లాడారు. గొల్లపూడి 1,2 సంబంధించి రబీ 2024– 25 పంట నమోదు జాబితాలో రైతుల పేర్లను టీ కావ్య, కె.శాంభవి చదివి వినిపించారు. కాగా రబీ సీజన్ కోసం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు అధికారులను కోరారు. ఏఇఓ ఆర్ సురేష్, పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

సీపీఎం నాయకుడు బాబూరావు



ఎన్టీటీపీఎస్ బూడిద చెరువును పరిశీలిస్తున్న సీపీఎం నేతలు సీహెచ్ బాబూరావు, డీవీ కృష్ణ, తదితరులు

ఇబ్రహీంపట్నం: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. ఇబ్రహీంపట్నం సీపీఎం కార్యాలయంలో మంగళవారం జరిగిన జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమైందన్నారు. స్మార్ట్ మీటర్లు పెట్టి ప్రజల జేబులు కొల్లగొడుతోందని ఎద్దేవా చేశారు. ఈనెల 8 నుంచి ప్రజాచైతన్య యాత్రలు ప్రారంభించామన్నారు. 17వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా సమస్యలను అధ్యయనం చేసేందుకు ప్రజా చైతన్య యాత్రలు జరుపుతామన్నారు. ప్రజా సమస్యలపై మార్చి 22 నుంచి 28 వరకు మండలాలు, పట్టణాల్లో ఆందోళన చేపడతామని తెలిపారు. యాత్రలో భాగంగా అంతకు ముందు ఎన్టీటీపీఎస్ బూడిద చెరువును జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ, ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, మండల కార్యదర్శి ఎం.మహేష్‌తో కలిసి సందర్శించారు. బూడిద, వాయు కాలుష్యంతో ఎంతోమంది దీర్ఘకాలిక వ్యాధులతో మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో 6.7కిలోమీటర్ల పరిధిలో ఉన్న అమరావతి రాజధానికి సైతం కాలుష్యం సెగ తాకుతుందని హెచ్చరించారు. బూడిద వ్యాపారంతో పాలకపక్ష పార్టీల నేతలు రోజుకు రూ.కోటి చొప్పున ఏడాదికి రూ.365 కోట్ల సంపాదన వెనకేసుకుంటున్నట్లు చెప్పారు.నాణ్యతలేని బొగ్గు వినియోగంతో వాయు కాలుష్యం పెరిగి పర్యావరణం దెబ్బతింటుందని స్పష్టం చేశారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు, ప్రజలకు ఉచిత వైద్య బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. తక్షణం రూ.100 కోట్లు కేటాయించి మార్చి నెలాఖరు లోపు కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నాయకులు, కార్యర్తలు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి సంఘానికి రూ.20 లక్షలు

మైలవరం: అర్హత ఉన్న ప్రతి సంఘానికి రూ.20 లక్షలు బ్యాంకు రుణాలు అందుతాయని ఏపీఎం బొలగాని రామకృష్ణ తెలిపారు. రెడ్డిగూడెం మండలంలో మండల మహిళా సమాఖ్య సమావేశాన్ని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ వీఓలలో ప్రతి నెలా రెండు సమావేశాలు నిర్వహించాలన్నారు. సమావేశంలోనే పుస్తక నిర్వహణ పూర్తి చేయాలని సూచించారు. బ్యాంకు రుణాలు, స్త్రీనిధి రుణాలు రికవరిలో 100 శాతంతో జిల్లాలో మొదటి స్థానంలో ఉండటం జరిగిందన్నారు. బుక్ కీపింగ్ 100 శాతం, ఎస్‌హెచ్‌జీ గ్రేడింగ్‌లో 85 శాతం ఏ గ్రేడులో జిల్లాలో ప్రథమ స్థానంలో రెడ్డిగూడెం మండలం ఉందన్నారు. ఎంఎస్ ప్రెసిడెంట్ కే శిరీష, ఎల్‌సీ సీసీ రమేష్, సీసీలు రత్నావళి, మణి, సుందరమ్మ, సిబ్బంది రమాదేవి, సురేష్, సభ్యులు, అన్ని గ్రూపుల ప్రసిడెంట్‌లు వీఓఏలు పాల్గొన్నారు.

31 మంది విద్యార్థుల గైర్హాజరు

మైలవరం: మైలవరంలో ఇంటర్‌మీడియెట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. మైలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన పరీక్షలకు 263 మంది విద్యార్థులకు గాను 238 మంది హాజరు కాగా 25 మంది విద్యార్థులు గైర్హాజరయినట్లు చీఫ్ సూపరింటెండెంట్ పీ రాధాకృష్ణ తెలిపారు. స్థానిక లిటిల్ ఫ్లవర్ జూనియర్ కళాశాలలో 151 మంది విద్యార్థులకు గాను 145 మంది హాజరయ్యారు. ఆరుగురు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ సుభాషిణి తెలిపారు. ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలు జరిగినట్లు తెలిపారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



చాట్రాయి: మండలంలోని చాట్రాయి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించారు. రోడ్ల పక్కన చెత్త కుప్పలను తొలగించి బ్లీచింగ్ చల్లారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మైలవరం: మైలవరం బస్టాండ్ ప్రాంతంలో అనారోగ్యంతో పడుకుని ఉన్న వ్యక్తిని స్థానికులు మైలవరం ప్రభుత్వ ఆస్పత్రికి వైద్య చికిత్స కోసం తరలించినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. రెండు రోజులుగా అసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. మైలవరం రెవెన్యూ అధకారి ఇచ్చిన రిపోర్టుపై ఎస్సై సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. చనిపోయిన వ్యక్తి ఆచూకి తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో తెలియజేయవలసిందిగా సూచించారు. ఫోన్ 94407 96447 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

సారా తయారీదారుల బైండోవర్

విస్సన్నపేట: మండలంలోని వేమిరెడ్డిపల్లి తండాలో సారా కాయడం, అమ్మడం తదితర నేరాలకు పలుమార్లు పాల్పడిన 8 మంది పాత నేరస్తులను ఎక్సైజ్ అధికారులు మంగళవారం అరెస్టు చేసి తహసీల్దారు కార్యాలయం ఎదుట బైండోవర్ చేశారు. పలుమార్లు హెచ్చరించినా సారా తయారుచేస్తున్న వీరినుంచి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. మండలంలోని వేమిరెడ్డిపల్లి తండా, నర్మదానగరం గ్రామాల్లో సారా వలన కలిగే అనర్థాలు వివరిస్తూ నవోదయం కార్యక్రమంలో ప్రదర్శనలు నిర్వహించారు. తిరువూరు ఎక్సైజ్ ఎస్ఐ కృష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లం అమ్మకందారుల బైండోవర్

చాట్రాయి: మండలంలోని నాటు సారా తయారీ, బెల్లం అమ్మకందారులను బైండోవర్ చేసినట్లు నూజివీడు ఎక్సైజ్ ఎస్సై మస్తానరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో బెజవాడ శ్రీనివాసరావు, పామర్తి నాగరాజు, వేముల ఏసమ్మ, రాంబాబు బెల్లం అమ్మకాలు నిర్వహించడం వలన తహసీల్దార్ డి.ప్రశాంతి కోర్టులో బైండోవర్ చేసినట్లు ఆయన చెప్పారు.

సమాజాభ్యున్నతి పనులు చేయాలి

మైలవరం: పూర్వ విద్యార్థులు తమ జీవితంలో సమాజానికి, కళాశాలకు సేవ చేయడానికి ఏ అవకాశాలు ఉన్నాయో తెలుసుకుని అభివృద్ధికి సహకరించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల సంఘాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రవి మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి సంబంధించిన విషయాలను, భవిష్యత్తులో ఏయే పనుల ద్వారా అభివృద్ధి చేయవచ్చో వివరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులతో నూతన కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షుడిగా కే రాజు, ఉపాధ్యక్షుడిగా టీ దేవిశ్రీ, జనరల్ సెక్రటరీగా డి.చంటి, జాయింట్ సెక్రటరీగా కే కుమార్ నాయక్, ట్రెజరర్‌గా డి.లావణ్య, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా అభిషేక్, స్పందన, ఆంజనేయులు, లిఖిత, సునీల్ కుమార్ నియమితులయ్యారు.

చెత్తసంపద కేంద్రం పరిశీలన

గానుగపాడు(తిరువూరురూరల్): మండలంలోని గానుగపాడులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని తిరువూరు ఎంపీడీవో రవిబాబు మంగళవారం పరిశీలించారు. వర్మికంపోస్టు ఎరువు తయారీ విధానం పరిశీలించి పలు సూచనలిచ్చారు. గ్రామంలో సేకరించిన చెత్తను తరలించడానికి చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి ఫణిగోపాల్‌ను ఆదేశించారు. సిబ్బంది పాల్గొన్నారు.

యువత పోరు పోస్టర్ల ఆవిష్కరణ



తిరువూరులో యువత పోరు పోస్టరు ఆవిష్కరిస్తున్న స్వామిదాసు, నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

తిరువూరు: కూటమి ప్రభుత్వం విద్యార్థుల ఫీజుల చెల్లింపు, ఉద్యోగాల కల్పన, నిరుద్యోగ భృతి ఇతర సమస్యలపై యువత విషయంలో అనుసరిస్తున్న నిర్లక్ష్యధోరణిని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఇచ్చిన పిలుపు మేరకు విజయవాడలో బుధవారం జరిగే యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు కోరారు. మంగళవారం తిరువూరులో యువత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు విద్యను దూరం చేసేందుకు కూటమి సర్కారు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చలమాల సత్యనారాయణ, కలకొండ రవికుమార్, యరమల రామచంద్రారెడ్డి, నగర పంచాయతీ కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, తాళ్ళూరి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు: అధికార టీడీపీ మోసపూరిత పాలనపై ప్రజల్లో తీవ్రమైన తిరుగుబాటు మొదలైందని ముసునూరు జెడ్పీటీసీ డాక్టర్ వరికూటి ప్రతాప్ అన్నారు. ముసునూరులో మంగళవారం సాయంత్రం గ్రామ పార్టీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ తులిమెల్లి సుబ్బారావు అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. నేతలు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలని ప్రచారం చేసి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ప్రజలను, మహిళలను నిలువునా మోసగించడంపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. విద్యార్థుల, నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడడం న్యాయం కాదని, సంపద సృష్టిస్తానన్న పెద్ద మనిషి నిధుల్లేవు, పథకాలంటే భయం వేస్తుందనడం సిగ్గుచేటన్నారు. అసమర్థ ప్రభుత్వంపై చేస్తున్న యువత పోరును విజయవంతం చేయాలని కోరారు. మాజీ సర్పంచ్‌లు రేగుల గోపాలకృష్ణ, పల్లెపాము కుటుంబరావు, చిలుకూరి శ్రీనివాసరావు (దత్తుడు), కాటేపల్లి రమేష్, రామారావు, గూడ్రు రంగారావు, కిషోర్, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల భవితకు అంగన్‌వాడీల కృషి అవసరం

నూజివీడు: అంగన్‌వాడీ కేంద్రాలను పోషకాహార కేంద్రాలుగా మార్చడమే కాకుండా నాణ్యమైన విద్యను అందించే పాఠశాలలుగా మార్చడమే పోషణ్ బీ.. పడాయి బీ కార్యక్రమం ముఖ్యలక్ష్యమని ఐసీడీఎస్ నూజివీడు ప్రాజెక్టు ఇన్‌చార్జి సీడీపీఓ కె.ధనలక్ష్మి పేర్కొన్నారు. నూజివీడు పట్టణం, మండలంలోని అంగన్‌వాడీ వర్కర్లకు పోషణ్ బీ, పడాయిబీ కార్యక్రమ అమలుపై మూడు రోజుల శిక్షణ తరగతులు మంగళవారం పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్‌లో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ దేశంలోనే అతిపెద్ద ప్రీస్కూల్ వ్యవస్థ అంగన్‌వాడీ వ్యవస్థ అన్నారు. దీని ద్వారా భవిష్యత్ తరాల పునాదులను బలోపేతం చేయాలనే లక్ష్యంతోనే కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు మూడు రోజుల శిక్షణ తరగతుల్లో పాల్గొని శిక్షణ పూర్తి చేసుకున్న తరువాత నేర్చుకున్న విషయాలతో అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలను విద్య, ఆరోగ్య పరంగా తీర్చిదిద్దాలన్నారు. హైస్కూల్ హెచ్‌ఎం కేవీ సత్యనారాయణ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు బంగారు భవిష్యత్‌ను అందించేందుకు అంగన్‌వాడీ వర్కర్లు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు టి.రమాదేవి, ఎల్.సులోచనారాణి, రాగమయి, అంగన్‌వాడీ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధం అమలుకు తీర్మానం

తిరువూరు: పట్టణంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలని నగర పంచాయతీ కౌన్సిల్ తీర్మానించింది. మంగళవారం చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, తంగిరాల వెంకటరెడ్డి ప్లాస్టిక్ నిషేధంపై అధికారులు తీసుకుంటున్న చర్యలను వివరించాలని కోరారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ తయారీ, దిగుమతి, నిల్వ, పంపిణీ, విక్రయం, వినియోగించడం నిషేధించినందున ఈ నిబంధన ఉల్లంఘిస్తే జరిమానాలు విధిస్తున్నట్లు కమిషనర్ లోవరాజు తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి ఉచితంగా నగర పంచాయతీకి సరఫరా చేసిన డీస్లెడ్జింగ్ వాహనాన్ని వ్యక్తులకు, సంస్థలకు లీజు ప్రాతిపదికన ఇచ్చేందుకు సమావేశంలో ఆమోదించారు. 20 వార్డులలో దుకాణాలు, హోటళ్ళు, రెస్టారెంట్లు, సినిమాహాళ్లలో తాగునీటి సరఫరాకు మీటర్లు ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ తెలిపారు. స్వచ్ఛభారత్‌లో పాత తిరువూరులోని బీసీ సంక్షేమ బాలుర వసతిగృహంలో రెండు మరుగుదొడ్లను నిర్మించడానికి రూ.2 లక్షలు కేటాయిస్తూ తీర్మానం చేశారు. సమావేశానికి తెలుగుదేశం కౌన్సిలర్లు డుమ్మా కొట్టారు.

పురుషులతో సమానంగా వేతనం ఇవ్వాలి

నూజివీడు: వ్యవసాయ, అనుబంధ రంగాల్లో పని చేసే మహిళా కూలీలకు వేతనాలను పురుషులతో సమానంగా ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ముసునూరు మండల కో–ఆర్డినేటర్ బుడుపుల జయశ్రీ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ ఏఓ ఉదయ భాస్కర్‌కు యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కనీస వేతనం రోజుకు రూ.850 ఇవ్వాలని, మహిళా కూలీలకు ఉచిత ప్రయాణం కల్పించాలని, పని ప్రదేశం వద్ద సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. వరకట్న నిషేధ చట్టాన్ని, బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని విస్తృతంగా ప్రచారం చేసి పటిష్టంగా అమలు చేయాలన్నారు. గర్భిణులకు ప్రసూతి ప్రయోజన పథకాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని, పని చేయలేక ఆదాయాన్ని కోల్పోతున్న గర్భిణులకు వైద్య ఖర్చుల కోసం నెలకు రూ.10 వేల చొప్పున ఆరు నెలల పాటు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో భూక్యా రంగా, కొత్తూరు రేఖ, అన్నపరెడ్డి అనూష, ఎ.తిరుపతమ్మ, బి.నాగమల్లేశ్వరి, బి.మేరీ, డి.భవానీ, బి.లలిత, బి.రాజకుమారి పాల్గొన్నారు.

కార్మికుల భద్రతపై అవగాహన ర్యాలీ

ఇబ్రహీంపట్నం: జాతీయ 54వ భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఇబ్రహీంపట్నం ఎన్టీటీపీఎస్‌లో కార్మికుల భద్రతపై అవగాహన ర్యాలీ మంగళవారం జరిగింది. సంస్థ చీఫ్ ఇంజినీర్ టి.నాగరాజు మాట్లాడుతూ కార్మికుల భద్రంగా ఉంటేనే సంస్థ మనుగడ సాధ్యమవుతుందన్నారు. కార్మికుల భద్రత కోసం అనేక రక్షణ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి కార్మికుడు తనచుట్టూ ఉన్న పరిస్థితులపై అధ్యయనం చేసినప్పుడు ప్రమాదాల నివారణకు మార్గంఏర్పడుతుందన్నారు. తల్లి జన్మనిస్తే భద్రత పునర్జన్మ ఇస్తుందన్నారు. జీవితంలో భద్రతను ఒక భాగం చేసుకుంటామని ఉద్యోగులు, కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. ఉద్యోగులు, ఇంజినీర్లు, కార్మికులు పాల్గొన్నారు.

ఎరుకుల సేవా సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

ఇబ్రహీంపట్నం: ఆదివాసి ఎరుకుల సేవాసంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ శంకరరావు అధ్యక్షతన ఇబ్రహీంపట్నంలో మంగళవారం జరిగింది. జిల్లా అధ్యక్షుడుగా రాగిణి కళ్యాణ్ ఏసు, ప్రధాన కార్యదర్శిగా కుంభం నాగేశ్వరరావు, వర్కింగ్ ప్రసిడెంట్ మేచర్ల పండుగోపి, కోశాధికారి మేచర్ల ఏసు, అధికార ప్రతినిధి శ్రీరామ్ సాంబశివరావు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన సభ్యులకు నియామక పత్రాలు అందజేసి ప్రమాణస్వీకారం చేయించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గరికపాటి శ్రీనివాసరావు, పాలపర్తి రామ్ ప్రసాద్, సాంబశివరావు, వివిధ జిల్లాల కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు.

దోమల మందు పంపిణీ

నూజివీడు: దోమల నివారణకు ప్రభుత్వం సరఫరా చేసిన మందులను పిచికారీ చేయడం ద్వారా సమర్థవంతంగా అరికట్టొచ్చని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కొలుసు సౌమ్య పేర్కొన్నారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం పీహెచ్‌సీ సిబ్బందికి దోమల నివారణ మందులను, పిచికారీ చేసే మందులను, అవగాహన కల్పించే పోస్టర్లను సిబ్బందికి అందజేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ దోమల వల్ల అనేక రోగాలు వ్యాప్తిని అరికట్టినపుడే ప్రజలు ఆరోగ్యంగా జీవిస్తారన్నారు. ఫైలేరియా వ్యాధిగ్రస్తులు తమ ఇంటి వద్దే బోదకాలు వచ్చిన భాగాన్ని శుభ్రపరుచుకొనుటకు కావాల్సిన పరికరాలు, ఆయింట్‌మెంట్, సబ్బులు తదితర సామగ్రిని అందజేశారు. సబ్‌యూనిట్ అధికారి యలమంద, సిబ్బంది పాల్గొన్నారు.

సవరణ

[illegible]

T.V.N. [illegible]